# అంబేద

ఇది కలా నిజమా అనుకున్నాడు కానిస్టేబుల్ కనకారావు. వీరాస్వామి చెప్పింది విని నమ్మలేక పోయాడు.

"వ్వాట్?" అప్రయత్నంగా అతని నోటినుంచి వెలువడింది. తెరచిన నోరు తెరచినట్లే వుండి పోయింది.

ఇది కలకాదు. నిజమే అన్నదానికి చిహ్నంగా వీరాస్వామి ఎర్రరంగుపర్సు అయిదువందల రూపాయలు పట్టుకొని నిల్చుని ఉన్నాడు.

"నాజేబులోనే దొరికిందా? నువ్వు పొరపాటుపడలేదుగా?"

"అదేమిటిబాబు! మీ పర్సు మీ డబ్బుకాకుంటే మీ దగ్గరకు లగెత్తుకొని వస్తానా?" అన్నాడు వీరాస్వామి.

కనకారావు నిద్రమత్తు వదిలిపోయింది. వాడిని ఇంకా ఏవేవో అడిగాడు. వాడు వాటికి జవాబులు చెప్పాడు. ఇలాంటి పిచ్చిప్రశ్నలు వేస్తూవుంటే వాడికేదైనా అనుమానం వస్తుందేమోనని తోచగానే అతని పోలీసుబుద్ధి పనిచేసింది.

"అలివేలుకి రోజురోజుకి మతిపోతున్నాది. మాసినబట్టలు వేసేముందు జేబులు చెక్‌చెయ్యాలని తెలియదా!" అన్నాడు కోపంగా.

"అమ్మగారిని కోపగించుకోకండి. నేనొస్తాను" పర్సూ, డబ్బూ అందిస్తూ అన్నాడు వీరాస్వామి.

"నీ నిజాయితీని మెచ్చుకుంటున్నానోయ్. ఈరోజుల్లో ఇలా దొరికిన డబ్బు నువ్వు కాబట్టి తిరిగి ఇచ్చావ్. మరొకరైతే ఇస్తారా? ఉండు" అంటూ లోపలికి వెళ్ళి ఒక రూపాయినోటు తెచ్చి వాడికిస్తూ "బీడీలు కొనుక్కో" అన్నాడు.

"సెలవుదొరా!" అన్నాడు వీరాస్వామి సంతోషంగా.

ఆ తరువాత కనకారావు తికమకలో పడ్డాడు.

ఈ పర్సు ఎవరిది? ఈ డబ్బు ఎవరిది?

తనదా?

ఊహు! ఎంతమాత్రం కాదు.

తనదగ్గర అయిదువందలుకాదు - అయిదుపదికాగితాలుకూడా లేవు. పైగా ఇంతవరకు జన్మలో పర్సుకొనలేదు.

---

అంబేద = దిట్టతనము లేనివాడు. శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు

వీరాస్వామి పొరబడ్డాడా? మరెవరి పర్సో తనదేనని భ్రమపడి ఇచ్చాడా?

'అదేంకాదు బాబూ! ఈరోజు తమరి బట్టలు కాక మరెవరివి పట్టుకెళ్ళలేదు. అయినా పొరపాటుకి అవకాశం ఏది? తమరి యూనిఫామ్‌లోనేగా ఈ పర్సు దొరికింది. నాదగ్గర బట్టలుతికించు కుంటున్న పోలీసులు తమరుకాక మరెవరులేరే?" అన్నాడు వీరాస్వామి.

అంటే ఈ పర్సు తన జేబులోనే దొరికిందన్నమాట.

నిన్నటివరకు విశాఖలో కర్ఫ్యూ డ్యూటీ చేసి నిన్న రాత్రే వచ్చాడు.

పొరపాటున మరొకరి పాంటు తను తెచ్చాడా?

అది తేల్చుకోవాలి.

అలివేలు ఇంటిలో లేదు. తను పడుకుంటాను అంటే ఆమె మేటనీషోకి వెళ్ళింది. ఇంటికి తాళంవేసి వీరాస్వామి ఇంటికి వెళ్ళాడు. వాడు చాకిరేవుకి వెళ్ళాడని తెలిస్తే అక్కడికి వెళ్ళాడు.

కానిస్టేబుల్ కనకారావుని చూడగానే చాకిరేవులోని చాకలివాళ్ళు గుసగుసలాడుకోసాగారు. తాగిన మైకంలో వున్న వాళ్లు భయపడి పారిపోసాగారు. వీరాస్వామి ఏదో పాడుపని చేసి వుంటాడని అందుకే వాడి భరతం పట్టడానికి కానిస్టేబుల్‌గారు వచ్చి వుంటారని కొందరు వూహాగానం చేసారు.

లారీ జడిపించుతూ "వీరాస్వామి ఎక్కడ!" అని అడిగాడు పోలీసు దర్పంతో.

"ఏంటి బాబూ! అదు తమరి గుడ్డలు ఎత్తుకుపోయాడా?"

కనకారావు కాదన్నట్లు బుర్రవూపాడు. "ఏం బాబూ! ఎండలో వచ్చారు. కాకిచేత కబురంపుతే నేను వచ్చేవాడినిగా?" అన్నాడు వీరాస్వామి

"ఒరేయ్! పర్సు నా జేబులోనే దొరికిందా?"

"ఔన్సార్!"

"అందులో అయిదువందలే వున్నాయా?"

"భగవంతుని సాక్షిగా అంతకుమించి నయాపైసా లేదుసార్"

"ఒరేయ్! ఆ పేంటు ఒక మారు చూపిస్తావా?"

వీరాస్వామి వుతుకుతున్న బట్టలలోంచి రెండు కాకీపేంట్లు తీసి "ఈ రెండింటిలో ఒక దాంట్లో ఆ పర్సు దొరికింది. ఏ పేంటో మరి?" అన్నాడు.

"ఈ రెండూ నావేనా? జాగ్రత్తగా చూసి చెప్పు."

"తమరివే సార్! ఈ మార్కుచూడండి మీ బట్టలకే ఈ మార్కువేస్తాను."

కనకారావు హృదయం తేలికపడింది "అలివేలు ఏమందో తెలుసా?" అన్నాడు.

"నాకేటి తెలుస్తాది?"

"నీ నిజాయితీని మెచ్చుకుందిరా! నన్ను చీవాట్లు పెట్టింది."

"ఎందుకు సార్!"

"అదేరా! నేనే నా పోలీసుబుద్ది పోనిచ్చుకున్నాను కాదుట. న్యాయంగా అతగాడు మన డబ్బు అయిదువందలు తిరిగియిస్తే వాడికి మీరిచ్చేది ఒక్క రూపాయా? ఎంత అల్పబుద్ది. కనీసం పది రూపాయలైనా ఇవ్వాలని తెలియదా అంది!"

"అమ్మగారికి నేనంటే ఆపేక్ష బాబు!"

"వీరాస్వామి! నాది పొరపాటేరా."

"దానికేం బాబూ! మీరు పెద్దోళ్లు మీలాంటివారు సంతోషంగా ఒక్కరూపాయి ఇచ్చినా పదిరూపాయలిచ్చినా మాకదే పదివేలు. డబ్బుదేముంది?"

కనకారావు వాడి చేతిలో పదిరూపాయలనోటు వుంచాడు.

"బాబూ! తమరు ముందిచ్చిన రూపాయి ఖర్చయిపోనాది."

"దానికేంలే. అదీనీదే. నే వస్తా."

కనకారావు హుషారుగా ఇంటికి వచ్చాడు. అతనికిప్పుడు నిబ్బరంగా వున్నది ఆ డబ్బు తన జేబులోనిదే. ఆ డబ్బూ - పర్సూ తన జేబులోనికి ఎలా వచ్చాయి?

అది శేషప్రశ్న!?

★ ★ ★

ఇంటికి రాగానే భార్య అలివేలు భర్తను నిలదీసింది. "ఏమండీ సాయంకాలందాకా నిద్రలేవ నన్నారే! ఇంటికి తాళంపెట్టి ఎటు దయచేసారు? ఈ ఎండలో అరగంటైై గుమ్మంలో కూర్చున్నాను."

అలివేలుకి జరిగింది చెప్పాడు.

"ఇంతకీ అలివేలూ! ఆ డబ్బూ ఆ పర్సు నా జేబులోకి ఎలా వచ్చాయి?"

ఈ పర్యాయం ఆశ్చర్యపోవటం అలివేలు వంతైంది.

"ఆ భగవంతుడే ఇచ్చి వుంటాడు. ఈ పదిరోజులై పైసా సంపాదన లేదుగా. చివరకు కూరా నారా కూడా డబ్బుపెట్టి కొనుక్కోవలసిన గతి పట్టింది నాకు. అందుకే భగవంతుడు నష్టపరిహారం చెల్లించి వుంటాడు" అంది నవ్వుతూ.

"నువ్వు మరీ సిల్లీగా మాట్లాడుతున్నావు. అదెలా సంభవం?"

"ఔనండి! సంభవం కాదు. వీరాస్వామి అబద్ధం ఎందుకు చెప్తాడు. పేంటుకూడా మారిగల్లు కాలేదు. ఆ పేంట్లు మీవేనని తేలిపోయింది. సిరిదావచ్చిన వచ్చును అనుపద్యం చదువుకోలేదా?" అంది రాగయుక్తంగా.

కనకారావులో భయం కలిగింది.

"అలివేలూ! నన్నెవరైనా ట్రాప్ చేయ్యాలని చూస్తున్నారేమో?" అన్నాడు అనుమానంగా.

"మిమ్మల్ని ట్రాప్ చెయ్యాలనా? ఎవరండీ? ఎందుకు?"

"ఎందుకేమిటి? చేస్తున్నది పోలీసు పని. ఎందరెందరి జేబులో కొడుతూ వుంటాను."

"బాగుంది వరుస. పాము కప్పలను తినదా? తిమింగలాలు చేపలను తినవా? అది మీ వుద్యోగధర్మం. పోలీసు వుద్యోగమనేగా మా వాళ్లు పదివేలు కట్నంపోసి ఈ సంబంధం చేశారు. లేకుంటే ఏ బడిపంతులుకో కట్టపెట్టి వుండేవారు. మహామహులే గడ్డి కరుస్తున్నారు. ఈ రోజుల్లో నీతిగా బ్రతికేవాళ్ళెవరు? అయినా మీరు వూరికే తింటున్నారా? వాళ్ళకు ఉపకారం చేయటంలేదూ?" అంది అలివేలు.

"అదీ నిజమే! అయినా మనం మన జాగ్రత్తలో వుండాలి" అన్నాడు భార్య మాటలతో కొంత

ధైర్యంవచ్చినా గుండెలో ఏదోమూల కీడుశంకిస్తున్నది.

"మీరేం గాబరా పడకండి. మీ పైరాబడితో నా ఏ అచ్చట్లూ ముచ్చట్లూ తీరేవికావు. ఇన్నాళ్ళకు దేముడికి నా మీద కనికరం కలిగింది. ఈ డబ్బుపెట్టి నేను చెవులకి టాప్సు చేయించు కుంటాను" అంది భర్త దగ్గరనుండి ఆ డబ్బు తీసుకుని.

భర్త సలహామీద పర్సును బూడిదచేసి పక్కకాలువలో ఆ బూడిద పడవేసింది అలివేలు.

కనకారావు మనసులో భీతాహంతో రెండురోజులు సెలవుపెట్టి ఇంటిలోనే వున్నాడు.

వీరాస్వామి వచ్చి "బాబూ! ఆ పర్సు డబ్బు తమరివికావు – ఫలానావారివి!" అని అంటాడేమో

'మిస్టర్ కనకారావూ! ఈ డబ్బు నువ్వు ఫలానావారి దగ్గర లంచంగా తీసుకున్నావు. నిన్ను అరెస్టుచేస్తున్నాం' అని పై అధికారులు అంటారేమో?

ఇలా గడియగడియకు భయపడుతునే వున్నాడు. అలివేలు మాత్రం నిబ్బరంగా ఉంది.

అయితే అలాంటి సంఘటనలేమీ జరగలేదు.

★ ★ ★

కొన్ని నిజాలు నిలకడమీద తెలుస్తాయి.

స్టేషనులో అడుగుపెట్టిన మరుక్షణం అతనికి ఈ చిదంబర రహస్యం అర్థమయ్యింది. మూడురోజులై శేషప్రశ్నగా మిగిలిపోయినది తనంతట తానే విడిపోయింది.

కనకారావు వుత్సాహంగా వున్నాడేమో, దిగులుగా కూర్చున్న రాముడయ్యను చూసి "ఏం రాముడయ్యా! దివాలా తీసినవాడిలా ఏమిటా ఫోజు?" అన్నాడు పరాచికంగా.

రాముడయ్య జవాబు చెప్పలేదు.

'ఆడేటి చెప్తాదురా! ఆడి డబ్బెవరో కాజేసినారు, దాంతో వాడు కుమిలిపోతున్నాడు" అన్నాడు సీతారాముడు.

డబ్బు మాటవినగానే గతుక్కుమన్నాడు కనకారావు.

"ఎలాపోయింది? ఎవరు కాజేశారు? ఎవరికాదమ్ములు? పోలీసు జేబే కొట్టాడా? ఎంత ధైర్యం? వాడికెంత కండకావరం! ఎక్కడ? ఎప్పుడు? చెప్పురాముడయ్యా. వాడిని ఎలాగైనా పట్టుకుని వాడి ఎముకలు విరగబొడుస్తాను." అన్నాడు కనకారావు

రాముడయ్య కనకారావువంక బాధగా చూసాడు.

"ఈ వూర్లో పోలేదు. మనం కర్నూలు డ్యూటీకి విశాఖపట్నం వెళ్ళాంగా! మన బేరక్‌లోనే పోయింది" అన్నాడు రాముడయ్య.

"ఏంటీ!?" ఆశ్చర్యపోయాడు కనకరావు.

"కనకారావు! ఆవేశం దేనికి? అసలు రాముడయ్య పొరపాటువల్ల ఆ పర్సుపోయింది. కావాలని ఎవరూ కొట్టేయలేదు" సీతారాముడు జరిగిన వుదంతం ఇలా చెప్పాడు.

"తిరుగు ప్రయాణపు ధ్యాసలో వీడు దండెంమీద తన యూనిఫారమ్ తీసి వేసుకొని పెట్టెలోని పర్సు అందులో భద్రంగా వేసుకున్నాడంట. తీరా ఆ పేంటు తనది కాదని గ్రహించి దాన్ని విప్పి తన పేంటు వెతికి మార్చుకున్నాడట. అయితే తొందరలో అందులో పెట్టిన పర్సు మాట

మరచిపోయాడు. తీరా ఇంటికొచ్చాక చూసుకుంటే పర్సులేదు. ఏభైఅరవైమందిలో ఎవరితో పోయిందో పాపం వీడి పర్సు" అన్నాడు.

"ఎంత డబ్బు పోయిందేమిటి?"

"అయిదువందలు"

"ఆ పర్సు ఎలాంటిది?"

"ఎర్రరంగు ప్లాస్టిక్ పర్సు" అన్నాడు రాముడయ్య.

కనకారావు ఆశ్చర్యపోయాడు. విచారించాడు. తానూ రాముడయ్య ఆ బేరక్‌లో పక్కపక్కనే వున్నారు.

'ఆ డబ్బు రాముడయ్యకు ఇచ్చేస్తే?'

"రాముడయ్యా! విచారించకు. ఆ డబ్బు మనవాళ్ళ మధ్యనేగా వుంది. దొరుకుతుందేమో!" అన్నాడు.

"నాకు నమ్మకం లేదు. అంత నిజాయితీపరులు ఈ రోజుల్లో వుంటారంటావా?" రాముడయ్యకు ఏడుపొచ్చినంత పనైంది.

ఏం చెయ్యాలి? ఆ డబ్బు ఇచ్చి తన నిజాయితీని నిరూపించుకోవాలా?

తాను కోరి దొంగిలించలేదుగా.... ఎందుకివ్వాలి?

ఎటూ తెగని స్థితి.

అలివేలు ఏమంటుందో?

★ ★ ★

"అయ్యో! మీకు బొత్తిగా జ్ఞానం లేదు. దొరికిన సొమ్ము తిరిగి ఇచ్చేస్తారా?"

"అదికాదు అలివేలూ! పాపం రాముడయ్య డబ్బు పోయినందుకు ఎంతో బాధపడుతున్నాడు."

"పోనీద్దురూ! నిజాయితీ నిరూపించుకొన్నందున లాభం ఏమిటి? రాముడయ్య బాధపడు తున్నాడా? అతను మాత్రం ఏపాటి నిజాయితీపరుడు. అతడెందరి నోళ్లు కొట్టడంలేదూ? చేతికి దొరికిన డబ్బు ఇచ్చేయటం ఇదెక్కడి న్యాయం? మీరు దొంగతనం చేయలేదుగా? అతడికి ప్రాప్తంలేదు. అందుకే దానంతట అదే మన దగ్గరకు వచ్చింది. మీరు తెలీనట్లు వూరుకోండి" అంది అలివేలు.

"అంతేనంటావా?" అన్నాడు.

"ఆఁ మీకు నేను చెప్పాలేమిటి? మీకు ఆ డబ్బు వాపసు చేయటం ఇష్టంలేదు. లేకుంటే స్టేషనులోనే రాముడయ్యతో యధార్థం చెప్పి వుండకపోయారా? అయినా ఆ పాపం నానెత్తిన వేయాలనేగా?"

"....................."

"చూడండి! ఆ అయిదు వందల్తో ఈ టాప్సు తీసుకున్నాను. బాగున్నాయా?" అంది అలివేలు.

కనకరావు నోరు మూతపడింది. అంతరాత్మ కిక్కురుమనలేదు.

(యువ - మాసపత్రిక)